క్లుప్తంగా

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

వి.కోట: ఈ నెల 17వ తేదీ మొదలు కానున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని 1,246 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్నారని, ఇందుకోసం మండలంలో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమయ్యే డెస్కులు, తాగునీరు, కరెంటు, ఇతర మౌలిక వసతులను ఇప్పటికే సిద్ధం చేసినట్లు చెప్పారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

కుప్పం: కుప్పం సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి వారిచే ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు జగదీష్‌బాబు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ శిబిరంలో కంటికి సంబంధించిన అన్ని సమస్యలకు పరీక్షలతో పాటు ఉచితంగా చికిత్సలు అందజేస్తామన్నారు.

దాతల సాయం వెలకట్టలేనిది



ప్లేట్లను అందిస్తున్న ప్రిన్సిపల్

వి.కోట: మండలంలోని గోనుమాకులపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు 100 మందికి నలంద విద్యాసంస్థల ఆధ్వర్యంలో కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ వినయ్ మాట్లాడుతూ మండలంలోని ఏ పాఠశాలలో అయినా పదోతరగతిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు తమ విద్యాసంస్థల్లో ఉచిత విద్యాసౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

పలమనేరు ప్రింట్ మీడియా నూతన కార్యవర్గం



కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

పలమనేరు: పలమనేరు ప్రింట్ మీడియా నూతన కార్యవర్గ ఎంపిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. అక్రిడేషన్ వర్కింగ్ జర్నలిస్ట్ ప్రింట్ మీడియా సంఘ అధ్యక్షుడిగా శ్యామ్, గౌరవాధ్యక్షుడిగా రఘునాథ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రెడ్డెప్ప, ప్రధాన కార్యదర్శిగా దిలీప్, కోశాధికారిగా సుబ్రమణ్యం, కార్యవర్గ సభ్యులుగా మణి, మోహన్, అనిల్, లీగల్ అడ్వైజర్‌గా రంజిత్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్యామ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంతో చొరవ చూపుతూ జర్నలిజం విలువలను కాపాడుతూ బాధ్యతగా ఉంటామని తెలిపారు.

రేష్మా భానునే కొనసాగించాలి


కుప్పం: కుప్పం మున్సిపాలిటీలో మెప్మా విభాగంలో ఆర్పీగా పని చేస్తున్న రేష్మా భానునే కొనసాగించాలని మోడల్ కాలనీకి చెందిన మహిళలు కోరారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు ధర్నా చేపట్టారు. డ్వాక్రా మహిళా సంఘాల్లో ఆర్పీగా పనిచేసున్న రేష్మాను తొలగించి వేరొకరిని నియమించారు. ఈమె గతంలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరురాలిగా పని చేసిందని ఆరోపిస్తూ కూటమి ప్రభుత్వ నేతలు తొలగించారు. కాగా అందరికీ ఆప్తురాలిగా, డ్వాక్రా మహిళలకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తున్న రేష్మాను ఆర్పీగా కొనసాగించాలని డిమాండు చేశారు.

ఘనంగా వసంతోత్సవం



పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. స్వామివారికి చందనం పెట్టి చక్రస్నానం నిర్వహించారు. ఉదయం జరిగిన స్వామివారి రథోత్సవం సందర్భంగా మహిళలు పూజలు చేశారు. అలాగే రాత్రి ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వి.కోట: సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతున్న లయన్స్‌క్లబ్ సభ్యులు శనివారం దాదాపు 500 మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ సంస్థ సభ్యుల జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి నెలా 15వ తేదీ పట్టణంలోని కేజీఎఫ్ బస్టాండు వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీ అని తెలిపారు. ఈ మేరకు పేద ప్రజలకు అన్నదానం చేపట్టడం తమకెంతో సంతృప్తిదాయకంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లబ్ మండల అధ్యక్షుడు ధీరజ్, సభ్యులు పాల్గొన్నారు.

మీరు చెబితే చేయరు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలమనేరు పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద దళారుల గోల ఎక్కువైంది. ఎవరైనా ఏదైనా పనికోసం కార్యాలయం వద్దకు వెళ్తే అక్కడే కాపుగాచుకున్న దళారులు వీరితో డీల్ చేసుకుంటారు. తాము చెప్తేనే అధికారులు పని చేస్తారని.. మీరు వెళ్తే పనులు కావని.. అదే తామైతే వెంటనే చేయిస్తామంటూ నమ్మబలుకుతున్నారు. చేసే పనిని బట్టి భారీగా డబ్బులు వసూలు చేసి కొంత సంబంధిత అధికారికి ముట్టజెప్పి.. మిగిలింది వీరి జేబుల్లోకి వేసుకుంటున్నట్లు తెలిసింది. ఈ గోల ఎక్కువగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీఓ, సబ్‌రిజిస్ట్రార్, మున్సిపల్ కార్యాలయాల వద్ద సాగుతోంది.



పలమనేరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

- మేము చెప్తేనే చేస్తారు అంటూ జనాన్ని నమ్మిస్తున్న దళారులు
- పలమనేరు ప్రభుత్వ కార్యాలయాల వద్ద కొత్త రక్తం దందా
- పనిని బట్టి డబ్బు వసూళ్లు
- అధికారులకూ ప్రతి పనిలో అందుతున్న మామూళ్లు

పలమనేరు: పలమనేరులోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద దళారుల హవా సాగుతోంది. వారు చెప్తేనే అధికారులు కూడా పనులు చేస్తున్నారు. సాధారణంగా ఎవరైనా మరణిస్తే వారి వారసులకు మాత్రమే డెత్ సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తారు. కానీ కొందరు అక్రమాల కోసం ఎవరిదో డెత్ సర్టిఫికెట్‌ను కావాలని అధికారులను అడిగితే వారు అందుకు అంగీకరించరు. కానీ దళారులు మాత్రం తాము తీయిస్తామంటూ డబ్బులు వసూలు చేసుకుంటున్నారు. పని కాకుంటే తమకు లాయర్లు చాలామంది తెలుసునని కోర్టులో కేసులు వేయించేస్తున్నారు.

కార్యాలయాల ముందే మకాం..

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏ పని లేకున్నప్పటికీ దళారులు మాత్రం పొద్దున్నుంచి సాయంత్రం ఏడు గంటల దాకా అక్కడే తిరుగుతుంటారు. సమీపంలోని టీ అంగళ్లు వీరికి అడ్డాగా మారాయి. అక్కడి వీఆర్వోలు, సర్వేసిబ్బంది, ఆర్‌ఐలు ఇలాంటి వారితో తాము కూటమి నేతలమంటూ తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఎవరైనా ఏదైనా పని మీద రాగానే వారిని ఆఫీసులోకి సైతం వెళ్లనీయకుండా వీరే డీల్ చేస్తుంటారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు సంబంధించి డాక్యుమెంట్లు రాసే వారు పదిమందికి పైగా ఇక్కడ ఆఫీసులను పెట్టేశారు. ఈ ఆఫీసు వద్ద కొందరు దళారులు సిద్ధంగా ఉంటున్నారు. ఇక మున్సిపల్ కార్యాలయంలో మరికొందరు ఇలా కార్యాలయాలను పంచుకుని మరీ కమీషన్ వ్యాపారాలు చేస్తున్నారు. ఆర్డీఓ కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగులతో సన్నిహితంగా ఉన్న మరికొందరు దళారులు అక్కడ కాపుగాచి పనులు చేయిస్తామంటూ సిద్ధంగా ఉంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద 50 మంది దాకా దళారులు ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. గ్రామాల నుంచి వచ్చే కొందరికి చదవడం కూడా రాదు కానీ వారు కూడా అధికారులు తమకు తెలుసనని ఏ పని కావాలన్నా ఇట్టే చేసేస్తామంటూ నమ్మబలికి అమాయకులు కుచ్చుటోపీలు నిత్యం పెడుతూనే ఉన్నారు. ఆయా శాఖల అధికారులకు దళారుల విషయం తెలియనప్పటికీ సిబ్బందితో పెట్టుకున్న సంబంధాలతో ఈ దందా కొనసాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దళారులను కార్యాలయాల్లోని రానివ్వకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారులతో ముందుగా పరిచయాలు

ఇటీవల అన్ని శాఖల్లోనూ బదిలీలు జరిగి సిబ్బంది నుంచి అధికారుల దాకా కొత్త వారు విధుల్లో చేరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త దళారులు రంగప్రవేశం చేసి తాము స్థానిక ఎమ్మెల్యేకి సన్నిహితులమంటూ అధికారులు, సిబ్బందిని నమ్మబలికి వారితో పరిచయాలు పెంచుకున్నారు. ఆపై ఏ పనికైనా నాకెంత, నీకెంత అనే చందాన మాట్లాడుకుని పనులు చేస్తున్నారు. నిబంధనల మేరకు కాని పనులను సైతం మేము చేసిస్తామంటూ దళారులు నమ్మబలికి అమాయకుల నుంచి దోచుకుతింటున్నారు.

వైభవంగా పుష్పయాగం



బైరెడ్డిపల్లి : మండలంలోని కడప నత్తం సమీపంలో వెలసిన శ్రీ నల్లగుండ్రాయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయం వద్ద స్వామివారి పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, అభిషేకం, కలశారాధన హోమం, దీపోత్సవం చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై శ్రీ అలమేలు మంగమ్మ, పద్మావతి సమేత శ్రీ నల్లగుండ్రాయస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దినకరగౌడు, రాజశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌గౌడు, నాగరాజుగౌడు, మునస్వామి, ప్రతాప్‌రెడ్డి, రఘుపతి గౌడు ఉభయదారులుగా వ్యవహరించారు.

సర్పంచ్‌కు గాయాలు

పలమనేరు: మండలంలోని పలమనేరు–కుప్పం రోడ్డులో మొరం వద్ద శనివారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో బైరెడ్డిపల్లి మండలం చింతలగుంట సర్పంచ్ బాలకృష్ణగౌడుకు గాయాలయ్యాయి. అతను తన భార్య, మనవడితో కలసి గ్రామం నుంచి బైక్‌పై పట్టణానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. గాయపడిన ఆయనను పలమనేరు ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం

- మిగిలిన అంశాలకు పచ్చజెండా
- సమస్యలను లేవనెత్తిన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ చాముండేశ్వరి, సమస్యలు తెలుపుతున్న కౌన్సిలర్లు

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీకి సంబంధించి 2025–26 బడ్జెట్‌ను మున్సిపల్ పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఆ మేరకు స్థానిక మున్సిపల్ సమావేశ హాలులో మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా 2025–26లో రూ.4.51 కోట్లు ఖర్చు చేయడానికి పరిపాలన ఆమోదం లభించింది. ఈ బడ్జెట్‌లో ప్రొవిజన్ వారీగా చూపబడిన 17 పద్దుల ఖర్చులు ఉన్నాయి. దీనికి ఆమోదం లభించింది. ఇదే బడ్జెట్‌లో భాగంగా టౌన్‌ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి రూ.2.7 కోట్లు ఖర్చు చేసేందుకు ఆమోదం లభించింది. మున్సిపల్ అభివృద్ధి పనులకు సంబంధించి సాధారణ నిధుల ద్వారా రూ.9.65 లక్షల పనులు, గతంలో ఎంపీ నిధుల ద్వారా మంజూరైన రూ.52 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఆమోదం వచ్చింది. పట్టణంలో డీ–స్లెడ్జింగ్ వాహనాల వినియోగానికి నెలవారి బాడుగలు, మున్సిపల్ చైర్‌పర్సన్ మున్సిపల్ విజిట్‌లో గుర్తించిన సమస్యలకు రూ.26.14 లక్షల నిధులను ఖర్చు చేసేందుకు అనుమతులు లభించాయి. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి నివారణకు ట్రాక్టర్లతో నీటి సరఫరా, మున్సిపల్ షాపింగ్స్ గదులపై జీఎస్టీ వసూలు ఏజెన్సీలకు ఖర్చులు, పట్టణంలో టౌన్‌హాలు నిర్మాణం, పారిశుద్ధ్య విభాగానికి ఖర్చులు తదితర 25 అంశాలకు పాలకవర్గం ఆమోదం తెలిపింది.

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఇళ్ల అప్రూవల్స్‌కు డబ్బులు వసూలు చేస్తున్నారని కౌన్సిలర్ మురళీకృష్ణ తెలిపారు. రాధాబంగ్లా వీధిలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని ఆ వార్డు కౌన్సిలర్ శ్యామ్ సూచించారు. మరికొందరు కౌన్సిలర్లు ఆయా ప్రాంత సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై అధికారుల ద్వారా తగు చర్యలు తీసుకుంటామని ఆమె సమాధానం ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గుల్జార్, రవితో పాటు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంకేతిక విజ్ఞాన ప్రదర్శన



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న కరస్పాండెంట్ రవీంద్రబాబు

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో సాంకేతిక విజ్ఞాన ప్రదర్శన సదస్సు శనివారం నిర్వహించారు. పలు విభాగాల విద్యార్థులు పాల్గొని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు ప్రదర్శించారు. విద్యార్థులు తమ ఆలోచనలకు అనుగుణంగా తయారు చేసిన అధునాతన సాంకేతిక నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలను కళాశాల కరెస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, అధ్యాపక బృందం పరిశీలించారు. విద్యార్థులు తమ నమూనాలను ప్రదర్శించడం వల్ల శోధన, ప్రేరణ, భాగస్వామ్యం లాంటి వివరాలను తెలుసుకోవడంతో పాటు అధునాతన సాంకేతికతను పెంపొందించుకుని లక్ష్యాలను సాధించగలరన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న కామర్స్ విభాగాధిపతి చిదంబరం

పలమనేరు: వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగాధిపతి డా.చిదంబరం తెలిపారు. స్థానిక కళాశాలలో అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వినియోగదారులు తమకు జరిగే నష్టాలను ఎలా పరిష్కరించుకోవాలి ? వినియోగదారుల ఫోరం తదితరాలపై వివరించారు. మరో అధ్యాపకుడు నందీశ్వరయ్య స్థిరమైన జీవనశైలికి న్యాయమైన పరివర్తన అనేఅంశంపై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటేశులు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతపై అవగాహన



సదుం: అవగాహన కల్పిస్తున్న డాక్టరు చరణ్

సదుం: మండల కేంద్రంలోని బాలుర హాస్టళ్లలో చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టరు చరణ్ చేతుల శుభ్రతపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. స్వర్ణ ఆంధ్రలో భాగంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆహారం తీసుకునే ముందు, మరుగుదొడ్డికి వెళ్లి వచ్చిన అనంతర తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. రెడ్డివారిపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హరిబాబు, అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పీఎంఏవైలో 450 ఇళ్ల మంజూరు

రొంపిచెర్ల: ప్రధానమంత్రి ఆవాస యోజన(పీఎంఏవై) 2. పథకంలో మండలానికి 450 ఇళ్లు మంజూరు అయినట్లు మండల హౌసింగ్ ఏఈ యోగానంద్ శనివారం తెలిపారు. ఈ పథకంలో లబ్ధిదారులకు రూ.2.50 లక్షలను ఇస్తారని తెలిపారు. కేంద్రప్రభుత్వం రూ.1.50 లక్షలు, రూ.1 లక్ష రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. అలాగే పునాదులు వేసుకునేందకు ఉపాధి పథకంలో రూ.27 వేలు, మరుగుదొడ్ల నిర్మాణానికి మరో రూ.12 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. సొంత స్థలాలు ఉన్న లబ్ధిదారులు తహసీల్దార్ కార్యలయంలో పొజిషన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే గతంలో ఇళ్ల నిర్మించుకునేందుకు ఆర్థిక స్థోమత లేక మధ్యలోనే పనులు ఆగిపోయిన 432 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మరో రూ.50 నుంచి రూ.75 వేలు వరకు ఇస్తుందన్నారు. బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు వంతున, ఎస్టీలకు రూ.75 వేలు వంతున ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈ కోరారు.

అధికారులకు రాజకీయాలతో పనేంటి ?

- ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వరా ?
- మండల మీట్‌లో ధ్వజమెత్తిన సభ్యులు
- బెల్టుషాపులపై తహసీల్దార్ ఆందోళన



అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ జని

శాంతిపురం: ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహణపై తమకు కనీస సమాచారం ఇవ్వకుండా అవమానిస్తారా ? అని మండల పరిషత్ సభ్యులు అధికారులను నిలదీశారు. మండలకేంద్రంలోని సచివాలయంలో శనివారం ఎంపీపీ వసుంధర అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీకి చెందిన గుంజార్లపల్లి సర్పంచ్ విజయరామిరెడ్డి(జని) మాట్లాడుతూ అధికారులకు రాజకీయాలతో పనేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం రాయితీపై ఇచ్చిన ఈ–సైకిళ్లను తమకు తెలియకుండానే పంపిణీ చేశారని, ఐకేపీ అధికారులు తమ మాటను కనీసం ఖాతరు చేయడం లేదని వాపోయారు. ఏ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధికైనా పథకాలు, కార్యక్రమాల సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తాము తహసీల్దారును కలవడానికి వెళ్తే కనీస గౌరవం ఇవ్వడం లేదన్నారు. దీనికి ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ స్పందిస్తూ ఇకపై ప్రజాప్రతినిధులకు సమాచారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దారు శివయ్య మాట్లాడుతూ పని ఒత్తిడి వల్ల తమ కార్యాలయానికి వచ్చే నాయకులతో చిట్‌చాట్ కుదరడం లేదన్నారు.

బెల్టుషాపులు తొలగించండి..

మండలంలో బెల్టుషాపులను తొలగించాలని, గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతుండడంతో అవాంఛనీయ ఘటనలు జరుగుతున్నాయని తహసీల్దార్ శివయ్య ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు దీనిపై స్పందించాలని కోరారు. తమ పంచాయతీలో ప్రతి పనికీ వీఆర్ఓ డబ్బు వసూళ్లు చేస్తూ జనాన్ని ఇబ్బందులు పెడుతున్నాడని సి.బండపల్లి ఎంపీటీసీ నామాలప్ప సభ దృష్టికి తెచ్చారు. దీనిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ చెప్పారు. జేసీబీలతో చేస్తున్న ఉపాధి హామీ పనులను కట్టడి చేయాలని కెనమాకులపల్లి సర్పంచ్ ఏవీ జయరాం కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ సరస్వతి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంలో భాగస్వామ్యులు కావాలి



పత్తికొండ పీహెచ్‌సీ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ, వైద్యాధికారి

బైరెడ్డిపల్లి : పారిశుద్ధ్యంలో అందరూ భాగస్వాములు అయినప్పుడే మన పరిసరాలు ఉంటాయని ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ అన్నారు. మండలంలోని తీర్థం గ్రామంలో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ప్రసాద్, మండల కోఆర్డినేటర్ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని నిర్మూలిద్దాం

పుంగనూరు: పర్యావరణానికి, ప్రజల మనుగడకు ముప్పు చేకూర్చుతున్న ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణ పురవీధుల్లో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రత్యేక అధికారి, వైద్యశాఖ అసిస్టెంట్ కమిషనర్ డా.చిట్టెమ్మ తెలిపారు. కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వర్ణ ఆంధ్రా–స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు.

పరిసరాల శుభ్రం

రొంపిచెర్ల: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి దినేష్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ ఆవరణలో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించడం, ఆస్పత్రి ఆవరణలో మొక్కలను నాటడం వంటి పనులు చేపట్టారు. అనంతరం రొంపిచెర్ల కేజీబీవీ, బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలోని పత్తికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అడిషనల్ డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించిన ఆయన, అనంతరం ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు.

ప్లాస్టిక్ వద్దు.. నూలు బ్యాగులే ముద్దు..

పలమనేరు: ప్లాస్టిక్ కవర్లు వద్దు నూలు బ్యాగులే ముద్దు అని ఏఎంసీ సెక్రటరీ సంజీవకుమార్ సూచించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంతో పాటు మండలంలోని కొలమాసనపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ కార్యాలయం వద్ద వ్యర్థాలను శుభ్రం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. మెప్మా, మున్సిపల్ సిబ్బంది, పాలిటెక్నిక్ విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ, అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారం చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



గుడుపల్లె : మండలంలోని కనమనపల్లెలో వెలసిన శ్రీ పద్మావతి సమేత శ్రీనివాసస్వామి ఆలయంలో ఆదివారం నుంచి 28వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఆలయంలో అంకురార్పణ, ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు వివిధ రకాల ఉత్సవాలు ఉంటాయన్నారు. ప్రత్యేకంగా ఈనెల 21వ తేదీన స్వామివారి గరుడ వాహన సేవ ఉంటుందన్నారు. అలాగే 23వ తేదీన స్వామివారి రథోత్సవం ఉంటుందని, అందుకోసం రథాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

19న వేలంపాట

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని వారపుసంత, దినసరి మార్కెట్, ప్రైవేటు వాహనాల వేలంపాటను ఈనెల 19న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో నిర్వహించిన వేలంపాటలకు గుత్తేదారులు రాని కారణంగా రెండుసార్లు వాయిదా వేయడం జరిగిందన్నారు. ఆసక్తి గల వ్యాపారులు నిబంధనల మేరకు ధరావత్తు, సాల్వెన్సీ సర్టిఫికెట్లు జత చేసి వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

మోడల్‌స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తులు


పుంగనూరు: మండలంలోని అడవినాథునికుంటలో గల మోడల్ స్కూల్‌లో 5వతరగతి, 10వ తరగతి తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో అడ్మిషన్లకు దరఖాస్తు చేయాలని ప్రిన్సిపల్ డాక్టర్ టీఎస్ రమ కోరారు. శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన బోధన, వసతులు, క్రమశిక్షణతో కూడిన చదువు అందిస్తున్నట్లు చెప్పారు. మోడల్‌స్కూల్‌లో అడ్మిషన్లకు ఈ నెల 31లోపు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని కోరారు.

దాడికి.. ప్రతిదాడి ఉంటుంది

- దాడుల సంస్కృతిని ఇకనైనా ఆపండి
- దాడుల విషయంలో పోలీసుల నిర్లక్ష్యం !
- టీడీపీ నేతల దాడిలో గాయపడిన వారికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



టీడీపీ నేతల దాడిలో గాయపడిన వారిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ



పీఎస్‌లో సంతకం చేస్తున్న వెంకటేగౌడ

పలమనేరు : ఇప్పుడు అధికారంలో ఉన్నాం.. పోలీసుల మద్దతు ఉందని మీరు ఓ దెబ్బ కొడితే.. రేపు మా పార్టీ అధికారంలోకి వచ్చాక మూడు దెబ్బలు తప్పవని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ హెచ్చరించారు. గంగవరం మండలం డ్రైవర్స్ కాలనీలో టీడీపీ నేతల దాడిలో గాయపడి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాబు, దిలీప్, విజయ్‌ను ఆయన నాయకులతో కలిసి శనివారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్నాం, రెడ్‌బుక్ పెత్తనం పెరుగుతోంది. దాడులు చేసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. కూటమి పేరుతో ఇలాంటి అరాచకాలు చేస్తుంటే పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పోలీసులు నిర్లక్ష్యంగా ఉండడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. ఆయన వెంట నాయకులు హేమంత్‌రెడ్డి, మండీ సుధా, బాగారెడ్డి, చంద్రప్ప, ప్రహ్లాద, భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

అక్రమ అరెస్టులను గమనిస్తున్నారు

పలమనేరు: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వంలోని నేతలు నెరవేర్చకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టడం, దాడులు చేయడం, గ్రామాల్లో రౌడీయిజాన్ని జనం గమనిస్తున్నారని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. స్థానిక పీఎస్‌లో షరతులతో కూడిన బెయిల్‌పై శనివారం ఆయన సంతకం చేసేందుకు వచ్చారు. అనంతరం ఆయన పట్టణ వైఎస్సార్‌సీపీ నేతలతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను పట్టించుకోకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న కూటమి ప్రభుత్వం త్వరలోనే జనాగ్రహానికి కొట్టుకుపోవడం తథ్యమన్నారు. కూటమికి ఎందుకు ఓటేశామా అని జనం మదన పడుతున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలను గాలికొదిలి రెడ్‌బుక్‌ను అమలు చేసుకుంటూ వెళ్తే ప్రజలు కూడా కూటమిని బుక్ చేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కౌన్సిలర్లు, యూత్ నేతలు పాల్గొన్నారు.